టేకు సాగు.. లాభాలు బాగు


మహదేవపురంలో సాగులో ఉన్న టేకు తోట


ఎస్‌కేఆర్ పురంలో ఆరేళ్ల టేకు తోట

పాలసముద్రం: వాణిజ్య పంటల సాగుతో తీవ్ర కష్ట నష్టాలు ఎదుర్కొంటున్న రైతన్నకు టేకు తోట ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. ఇప్పుడిప్పుడే ఈ పంటపై అన్నదాతల్లో చైతన్యం పెరుగుతోంది. మండలంలో టేకు సాగు విస్తీర్ణం నాలుగైదేళ్ల నుంచి గణనీయంగా పెరుగుతోంది. టేకుతోట సాగు విధానం, దిగుబడి, రాబడి వివరాలను నగరి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ వారి మాటల్లోనే వివరించారు. టేకు తోటల సాగు ఎంతో లాభదాయకం. రైతుకు మంచి ఆదాయాన్ని తెచ్చి పెడతాయి. భారీ కమతం ఉన్న రైతులు టేకు తోటలు పెంచుకోవడం ఉత్తమం. మండలంలో టేకు తోట సాగుకు అనువైన భుములు ఉన్నాయి.

టేకు మొక్కలు నాటడం ఇలా...

మొక్కకు మొక్కకు మధ్య మూడు మీటర్ల దూరం పాటించాలి. ఎకరాకు వెయ్యి మొక్కలు నాటాలి. నాణ్యమైన మొక్కలు నర్సరీల్లో దొరుకుతాయి. ప్రస్తుతం టేకు మొక్కలు నాటుకునేందుకు అనువైన సమయం. రబీలో భాగంగా పొలాల్లో టేకు సాగు మొదలు పెట్టవచ్చు. మాగాణి భూముల్లోనూ మొక్కలు నాటుకోవచ్చు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది.

ఆదాయం మెండే

మొక్కలు నాటాక ఆరేళ్ల నుంచి మొక్కలు నరికేందుకు అనువుగా ఉంటుంది. ఆరేళ్లకోసారి, 12 ఏళ్లకోసారి, 18 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు పొలంలోని అక్కడక్కడా టేకు చెట్లు నరికి మార్కెట్‌కు తరలించాలి. టేకు 18 ఏళ్ల వయసు దాటాక ఎకరం విస్తీర్ణంలో 165 మొక్కలు మాత్రమే ఉండాలి. మిగిలిన 830 మొక్కలను పైన తెలిపినట్లుగా మూడు దఫాలుగా నరికి విక్రయించుకోవాలి. టేకు వయసు 30 ఏళ్లు రాగానే పూర్తిస్థాయిలో నరికేసుకోవచ్చు. మార్కెట్‌లో విక్రయించుకోవచ్చు లేదా వ్యాపారస్తులకు అమ్మివేయాలి. రైతు జాగ్రత్తగా సాగుచేస్తే, యాజమాన్య పద్ధతులు సక్రమంగా అవలంబిస్తే 30 ఏళ్ల వయసు రాగానే 1160 ఘనపు అడుగుల టేకు దిగుబడి వస్తుంది. ఇది శాస్త్రీయ అంచనా. ప్రస్తుతం ఘనపు అడుగు విలువ రూ.3 వేలు వరకు ఉంది. ఈ ధరే 30 ఏళ్ల తర్వాత ఉందనుకుంటే ఎకరా విస్తీర్ణంలో రూ.35 లక్షలు అదాయం వస్తుంది. మూడు దఫాలు నరికిన తర్వాత మిగిలిన 830 మొక్కల నుంచి వచ్చే ఆదాయం అదనం. ఆ మూడు దఫాలు కలిపి 600 ఘనపు అడుగుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అంటే రూ.18 లక్షల ఆదాయం వస్తుంది. మొత్తం మీద ఎకరం టేకు తోట సాగు చేపడితే 30 ఏళ్లలో నాలుగు దఫాలు మొత్తం రూ.45లక్షల వరకు ఆదాయం వచ్చే వీలుంది.

పెట్టుబడి... మార్కెటింగ్

టేకు మొక్కల కొనుగోలు, తొలి రెండేళ్లపాటు అంతర కృషి, పురుగు మందులు, ఎరువులు మొత్తం కలిపి ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. రెండేళ్లపాటు పంటకు పెట్టుబడి పెడితే చాలు. ఆ తర్వాత ఇక ఖర్చు చేయాల్సిన అవసరం రాదు. తొలి నాలుగేళ్లపాటు టేకులో అంతర సాగు చేపట్టవచ్చు. దాదాపు అన్ని పంటలూ వేసుకోవచ్చు. పంట వయస్సు 18 ఏళ్ల తర్వాత ఎకరం విస్తీర్ణంలో కేవలం 165 మొక్కలే ఉంటాయి. కాబట్టి మిగిలిన 12 ఏళ్లపాటు అంతర పంటలు అన్ని పంటలు సాగు చేసుకోవచ్చు. టేకు తోట నరికాక మార్కెటింగ్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మండల పరిసర ప్రాంతాలు, తమిళనాడులో టేకు వ్యాపారులు ఎందరో ఉన్నారు. టేకు తోటను అమ్ముకోవాలనుకున్నప్పుడు వ్యాపారులు లేదా రైతులు తహశీల్దార్ నుంచి అనుమతి పత్రం తెచ్చుకుంటే చాలు. ఇబ్బందులు లేకుండా మార్కెట్‌కు తరలించుకోవచ్చు.

చీడపీడల నివారణ

రైతులు సాగు చేసిన టేకు తోటలో సహజంగా ఆకువచ్చ తెగులు, తుప్పు తెగులు కనిపిస్తున్నాయి. గట్ల వెంట తొలిచే పురుగులు కూడా గమనిస్తున్నాం. ఇవేవీ అంత ప్రమాదకరమైనవేమీ కాదు. అంతర పంటలు వేసుకుంటే చీడపీడల బెడద నుంచి కొంత తప్పించుకోవచ్చు. వాటి కోసం మోనో క్రొటోఫాస్ మందును పిచికారీ చేసుకుంటే టేకు తోటను చీడపీడలకు దూరంగా ఉంచుకోవచ్చు.

నీరు ఇలా అందించాలి.

- మొక్కలు నాటగానే నాలుగు రోజులపాటు రోజు మార్చి రోజు నీరు పోయాలి.
- సహజంగా ఇప్పటి నుంచి వర్షాలు కురిసే అవకాశాలు చాలా తక్కువ కాబట్టి మొక్కలకు ప్రతి 15 రోజులకోసారి నీరు పోయాలి.
- వేసవి వచ్చాక ప్రతి పది రోజులకోసారి నీరు అందించాలి.
- నీరు తక్కువగా వుంటే డ్రిప్ పద్ధతిలోనూ నీరు పెట్టొచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మొక్కలు నాటిన రెండు నెలల తరువాత ఒక్కో మొక్కకు నాలుగు కిలోల పశువుల ఎరువు వేయాలి.
- ఏడాది తరువాత ఒక్కోమొక్కకు 150 గ్రాముల డీఏపీని పాదుల్లో వేయాలి.
- రెండో ఏడాది ప్రతి మొక్కకు 30 గ్రాములు, మూడేళ్లు దాటిన మొక్కలకు 400 గ్రాములు చొప్పున నవంబర్, జనవరి మాసాల్లో వేయాలి.

క్లుప్తంగా

తిరుపతి ఎంపీని కలిసిన వైఎస్ఆర్ సీపీ నేత


ఎంపీ గురుమూర్తితో వైఎస్ఆర్ సీపీ నేత హేమసుందర్ రెడ్డి

వెదురుకుప్పం: తిరుపతి ఎంపీ గురుమూర్తిని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి కలిశారు. గురువారం రేణిగుంట విమానాశ్రయంలో ఎంపీని కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఇటీవల జరిగిన ఎన్నికల నేపథ్యంలో జరిగిన పరిణామాలు తదితర అంశాలను ఎంపీ గురుమూర్తికి వివరించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడకుండా ఉండాలన్నారు. అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు హేమసుందర్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


కేక్ కట్ చేస్తున్న మోహన్‌మురళీ

వెదురుకుప్పం: గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు పి.మోహన్‌మురళీ అన్నారు. సీఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గురువారం వెదురుకుప్పంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్రాన్ని, ఎమ్మెల్యేగా వీఎం థామస్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోలార్ చిన్నబ్బ, దాసు, కోదండ రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డిపాజిట్లపై వడ్డీ రేట్ల పెంపు

తవణంపల్లె: సప్తగిరి గ్రామీణ బ్యాంకు డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచినట్లు తవణంపల్లె శాఖ బ్రాంచ్ మేనేజర్ తిరుమలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్లపై అత్యధికంగా 8.6 శాతం వడ్డీరేట్లు పెంచినట్లు పేర్కొన్నారు. రెండేళ్లకు పైబడిన డిపాజిట్లపై ఏడాదికి సాధారణ వ్యక్తులకు 8.1 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.6 శాతం వడ్డీరేట్లు పెంచినట్లు తెలిపారు. అదే విధంగా ఏడాదికి సాధారణ వ్యక్తుల డిపాజిట్లకు ఏడాదికి 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీరేట్లు పెంచినట్లు పేర్కొన్నారు.

బీసీజీ టీకాతోనే టీబీ కట్టడి

చిత్తూరు రూరల్(కాణిపాకం): బీసీజీ వ్యాక్సిన్‌తోనే క్షయ వ్యాధిని కట్టడి చేయగలిగామని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని మాపాక్షి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిష్యత్‌లో టీబీ లేని సమాజం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ముందస్తు నివారణ చర్యల్లో బీసీజీ వ్యాక్సిన్ తీసుకొచ్చిందన్నారు. అర్హులైన వారికి కచ్చితంగా టీకాను వేయాలని సిబ్బందికి సూచించారు.

అంతర పంటలతో బహుళ ప్రయోజనాలు

గుడుపల్లె: వేరుశనగ పంటలో చిరుధాన్యాల సాగు రైతులకు ఎంతో శ్రేయస్కరమని వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. వేరుశనగ ఎకరా విస్తీర్ణంలో సాగు చేయాలంటే రూ.25 వేలు, 30 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఇందులో అంతర పంటలుగా చిరుధాన్యాలు వేస్తే అదే పెట్టుబడితో మరింత లాభాలు వస్తాయన్నారు. కొర్ర, అండుకొర్రలు, సజ్జ, జొన్న, అలసంద, కంది, సామ పంటలు వేయడంతో ఆదాయం పెరుగుతుందన్నారు.

ప్రత్యేకమైన ఎరువులు అవసరం లేదు

వేరుశనగలో సాగు చేసే అంతరపంటలకు ప్రత్యేకమైన ఎరువులు, మందులు అవసరం లేదన్నారు. అంతర పంటల సాగుతో భూమి కూడా సారవంతంగా ఉంటుందని తెలిపారు. చిరుధాన్యాలు 60 నుంచి 70 రోజుల్లో కోతకు వస్తాయని, చిరుధాన్యాల పంటలు ఎక్కువగా సేంద్రియ ఎరువులతోనే పండుతుందన్నారు. ఆరోగ్యానికి కూడా మంచిదని వివరించారు.

గౌరవ వేతనం చెల్లించాలని వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది

నగరి: ఎన్నికల విధుల్లో పాల్గొన్న తమకు గౌరవ వేతనం చెల్లించాలని నియోజకవర్గ సెక్టార్లు, రూట్ ఆఫీసర్లు, ఎఫ్ఎస్‌టీ టీమ్ మెంబర్లు కోరారు. వారు గురువారం ఎన్నికల అధికారి, తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రావలసిన వేతనం, టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ జిల్లా అధికారులతో చర్చించి రూ.10 వేలు చెల్లిస్తామని తెలిపారు. దీనిపై ఎన్నికలకు పనిచేసిన సిబ్బంది మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఒక్కొక్కరికి రూ.20 వేలు ఇస్తున్నారని, ఆ మేరకు తమకూ చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య


పిల్లలకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్నారని ఎంఈఓ గిరిజ తెలిపారు. గురువారం పాలసముద్రం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో చదివిన విద్యార్థులే సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నారు. అందువలన ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని తెలిపారు. ముఖ్యంగా విద్యతోపాటు క్రమశిక్షణ తప్పకుండా నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మీనాక్షి, సీఆర్పీ మునిరాజ్, ఐఆర్‌టీ టీచర్ బాలాజీ, ఉపాధ్యాయులు ధనరాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న ఎంపీపీ హేమలతరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు తమవంతు భాగస్వాములు కావాలని ఎంపీపీ మహాసముద్రం హేమలతరెడ్డి తెలిపారు. ఆమె అధ్యక్షతన గురువారం పెనుమూరు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండల కోఆప్షన్ సభ్యుడు మురాద్ ఖాన్‌కు సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం వివిధ శాఖల వారీగా సమీక్ష చేపట్టారు. రామకృష్ణాపురం దూది వెంకటేశులు మాట్లాడుతూ పంచాయతీ గ్రామాల్లో ఎక్కడా శ్మశానం లేదని గత సమావేశం దృష్టికి తెచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో తహశీల్దారు సుభద్ర స్పందిస్తూ శ్మశానాల కోసం సర్వే చేశామన్నారు. త్వరలో శ్మశాన స్థలాలు చూపిస్తామన్నారు. నంజరపల్లె సర్పంచ్ ఉష మాట్లాడుతూ తాను సర్పంచ్ అయినప్పటి నుండి పంచాయతీకి ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదన్నారు. గ్రామాలు అభివృద్ధి చేయలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఎంపీడీఓ వెంకటేశ్వరరావు స్పందిస్తూ గ్రామాల అభివృద్ధికి నిధులు అడిగితే తప్పక ఇస్తామని సమాధానం ఇచ్చారు. సాతంబాకం ఎంపీటీసీ సభ్యురాలు యశోదారెడ్డి మాట్లాడుతూ డెప్యూటీ సీఎం గడప గడపకూ వైఎస్ఆర్ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నంజరపల్లె పంచాయతీలో తిరిగినా సర్పంచ్ ఉష ఎక్కడా హాజరు కాలేదన్నారు. ఇప్పుడు నిధులు ఇవ్వలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంపీపీ హేమలతరెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తిన వెంటనే అధికారులు పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొరస్వామి యాదవ్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహశీల్దారు సుభద్ర, వెలుగు ఏపీఎం హరికృష్ణ, పంచాయతీ రాజ్ ఏఈ శశిభూషణ్ రెడ్డి, వైస్ ఎంపీపీలు కోదండన్, జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు యశోదారెడ్డి, శివలింగం, పళని, సుభాషిణి, సర్పంచ్‌లు కోదండ రామిరెడ్డి, రామచంద్ర భూపతి పాల్గొన్నారు.

పరమేశ్వరమంగళంలో నీరు స్వచ్ఛమైనదే



నీటిని పంపిణీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పుత్తూరు: మండలంలోని పరమేశ్వరమంగళంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లోని నీరు స్వచ్ఛమైనదేనని సెక్రటరీ ఉషారాణి స్పష్టం చేశారు. ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల నందిమంగళంలో అతిసారం ప్రబలిందని తెలిపారు. ఈ నేపథ్యంలో పరమేశ్వరమంగళంలోని ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లోని నీరు కూడా పరిశుభ్రంగా లేదంటూ కొందరు దుష్ప్రచారం చేశారని తెలిపారు. దీనిపై తాము ఇక్కడి నీటి శ్యాంపుల్స్‌ను 11న నగరిలో ఉన్న ప్రభుత్వ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబొరేటరీలో పరీక్ష చేయించినట్టు పేర్కొన్నారు. ఫలితాల్లో నీరు స్వచ్ఛమైనదేనని వచ్చినట్టు వివరించారు. ఈ మేరకు వారు ఇచ్చిన సర్టిఫికెట్‌ను వాటర్ ప్లాంట్‌లో ఉంచినట్లు తెలిపారు. గ్రామస్తులు ఎలాంటి అనుమానాలకు పోకుండా మంచి నీటిని వినియోగించుకోవాలని కోరారు.

కొండెక్కిన కూరగాయల ధరలు


పుత్తూరులోని కూరగాయల దుకాణం, (క్రింద) రూ.20ల వంతున అమ్ముతున్న కప్పు కూరగాయలు

- బీన్స్ కిలో రూ.150
- పచ్చిమిర్చి కిలో రూ.100
- టమాట కిలో రూ.70
- ఎర్రగడ్డలు రూ.50
- క్యారెట్ రూ.70,
- చిక్కుడు రూ.70



పుత్తూరు: కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే అరకొర ఆదాయంతో కూరగాయలు కొని తినలేమని వాపోతున్నారు. రెండు వారాల క్రితానికి, ఇప్పటికి ధరలు రెట్టింపు కావడంతో బెంబేలెత్తిపోతున్నారు. రెండు వారాల క్రితం వరకు టమాట కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.60కి చేరింది. బీన్స్ రూ.80 నుంచి ఒక్కసారిగా రూ.150కి పెరిగింది. పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.100కు పెరిగింది. అలాగే ఎర్రగడ్డలు, చిక్కుడు, బీరకాయ, క్యారెట్ వంటి అన్ని కూరగాయల ధరలు కూడా రెట్టింపు అయ్యాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిలలాడుతున్నారు. పూట గడిస్తే చాలన్నట్టు ప్రజలు ఆర్థిక జాగ్రత్తలు పాటిస్తున్నారు. వ్యాపారులు సైతం యాభై శాతం మేరకే సరుకులు కొనుగోలు చేసి విక్రయించుకొనే పరిస్థితి ఏర్పడింది.

ఒత్తిడి లేని విద్య అవసరం


విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న డీఈఓ దేవరాజు

గంగాధర నెల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని, ఒత్తిడి లేని విద్య అవసరమని చిత్తూరు జిల్లా విద్యాధికారి దేవరాజు అన్నారు. మండలంలోని నెల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మమేకమై ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పిల్లలతో ముచ్చటించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారు భవిష్యత్తులో లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. 2024 జరిగిన పదో తరగతి ఫలితాలలో మండలంలోని మొదటి, రెండో, మూడో స్థానం నెల్లేపల్లి పాఠశాలకు రావడంతో విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంజనేయులు శెట్టి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయుడు యుగంధర్ ఆచారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి


ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శ్రీరంగరాజపురం: ఉపాధి హామీ పనులను ఏపీఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మస్టర్ రికార్డు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలని, కూలీల సంఖ్యను పెంచి, వారి హాజరును ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. ప్రతి కూలీకి ఒక పనిదినానికి గరిష్ఠంగా రూ.300 కేటాయించామన్నారు. కూలీల హాజరులో ఏవైనా అవకతవకలు చేస్తే సంబంధిత అధికారిని విధుల నుంచి తొలగిస్తామన్నారు. అనంతరం మండలంలోని శ్రీరంగరాజపురం, జీఎంఆర్ పురం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ ఫారం, కాలువ పనులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. జేఈ జ్యోతి, టీఏ నౌషాద్, రేఖ, బాల, రామ్మూర్తి, నోమేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ శకుంతల, జ్యోతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహా మునేశ్వరునికి నూతన ఆలయం


అశ్వ ప్రతిమ


ఆలయంలో నిర్మించిన భారీ మునేశ్వరుడి ప్రతిమ


నూతనంగా నిర్మించిన మహామునేశ్వర ఆలయం

- దాతల సహకారంతో ఆలయ నిర్మాణం
- నేటి నుంచి కుంభాభిషేక ఉత్సవాలు

నగరి: మున్సిపల్ పరిధి కళింమిట్ట సమీపం వేల్‌నగర్‌లోని మహామునేశ్వర స్వామికి నూతన ఆలయం నిర్మించారు. దాతల సహకారంతో ఈ ఆలయం నిర్మితమైంది. గతంలో చెట్టు వద్ద ఉన్న శిలలకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకునేవారు. ఆలయం వద్ద ఎలాంటి వసతులు ఉండేవి కాదు. ఈ క్రమంలో స్థానికులు నూతన ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. దాతల సహకారంతో ప్రధాన ఆలయం, ఆలయ గోపురం, భక్తులు కూర్చోవడానికి మండపం, ఆకర్షించే భారీ మునేశ్వర స్వామి ప్రతిమలు, గర్భాలయ గోపురంపై ధర్మముని, తవముని, నాదముని, శివముని, మహాముని, వాల్‌ముని, జడాముని మునీశ్వరుల ప్రతిమలు ఏర్పాటుచేశారు.

నేటి నుంచి కుంభాభిషేక వేడుకలు

ఆలయ కుంభాభిషేక వేడుకలు శుక్రవారం మొదలై మూడు రోజులు నిర్వహించనున్నారు. విఘ్నేశ్వర అనుజ్ఞతో ప్రారంభమయ్యే ఈ పూజలు ఆదివారం జరిగే మహాకుంభాభిషేకం, మహాభిషేకంతో ముగుస్తాయి. ఆ రోజు నుంచి గర్భాలయంలోని మహా మునేశ్వరున్ని భక్తులు దర్శించుకోనున్నారు.